కష్టాల కడలికి ఫుల్‌స్టాప్

- వర్షాకాలంలో వాగుల ఉధృతికి తల్లడిల్లిన ఆదివాసీలు
- బ్రిడ్జిలు, బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు
- రూ.22 కోట్ల వ్యయంతో మొదలుకానున్న పనులు



కుమ్మరిపాడు శివారులోని లోలెవల్ చప్టాపై వరద ఉధృతికి కొట్టుకుపోతున్న తల్లీకూతుర్లు (ఫైల్), ప్రస్తుతం బ్రిడ్జిలు కట్టనున్న చప్టాల్లో ఇదొకటి..

ములకలపల్లి: మండలంలో అభివృద్ధి పనులకు 22 కోట్ల రూపాయలు మంజూరు కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటితో మూడు వంతెనలు, వివిధ మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు నిర్మించనున్నారు. ఇటీవలే ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శంఖుస్థాపన చేసి, పనులను లాంఛనంగా ప్రారంభించారు.

తప్పిన తిప్పలు..

లోలెవల్ చప్టాలతో ఏజెన్సీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. మండలంచుట్టూ సుమారు 18 కిలోమీటర్ల మేర ముర్రేడు, పాములేరు తదితర వాగులు ప్రవహిస్తుంటాయి. వర్షాల కాలంలో చప్టాలపై వరద ఉధృతి రావడంతో, మారుమూల గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో ముత్యాలంపాడు శివారు వాగుపై 5.25 కోట్లతో బ్రిడ్జి నిర్మించనున్నారు. దీంతో ముత్యాలంపాడు, రాచన్నగూడెం జీపీల్లోని గిరిజన గ్రామాలకు రాకపోకల సమస్య తీరనుంది. కుమ్మరిపాడు శివారులోని వాగులో ఇటీవలె వరద ఉధృతికి తల్లీకూతుర్లు గల్లంతుకాగా, కూతురు సురక్షితంగా బైటపడింది. తల్లి కుంజా సీత మృత్యువాతపడింది. ఈ సంఘటన పాఠకులకు తెలిసిందే. ఇక్కడ వంతెన నిర్మించేందుకు రూ.4.63 కోట్లు మంజూరయ్యాయి. ఇక ములకలపల్లి శివారులో రూ.4.50 కోట్లతో మరో బ్రిడ్జి నిర్మించనున్నారు. దీంతో తాళ్లపాయ జీపీలోని పలుగ్రామాల ప్రజలకు వరద కష్టాలు తప్పనున్నాయి.

రూ.7.5 కోట్లతో బీటీ రోడ్లు

ఎన్నోఏళ్లుగా మారుమూల గ్రామాల గిరిజనుల రహదారి కష్టాలు గట్టెక్కాయి. రూ.1.12 కోట్లతో జిన్నెలగూడెం నుంచి రాచన్నపేటకు, రూ 1.68 కోట్లతో జగన్నాథపురం శివారు నుంచి రేగులకుంటకు, రూ.1.60 కోట్లతో చాటిగూడెం నుంచి రింగిరెడ్డిపల్లి గ్రామానికి, రూ.2 కోట్లతో మంగపేట నుంచి రామాంజనేయపురం గ్రామానికి, రూ.1.12 కోట్లతో కొమ్ముగూడెం నుంచి అల్లిగుంపు గ్రామానికి బీటి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తికాగా, ఐటీడీఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు వీటిని పర్యవేక్షించనున్నారు.

ఆగిపోవాల్సి వచ్చేది..



వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర అంతరాయాలు కలిగేవి. లోలెవల్ చప్టాలపై వరదనీళ్లు ప్రవహించడంతో జలదిగ్బంధనంలోనే గడపాల్సి వచ్చేంది. బ్రిడ్జి నిర్మాణంతో కష్టాలు తీరనున్నాయి.

– తాటి ప్రవీణ్, ముత్యాలంపాడు

అవస్థలు తప్పాయి



మూరుమూల గ్రామాలకు సైతం బీటీ రోడ్లు నిర్మిస్తూ, రహదారి ఇబ్బందులను తొలగిస్తున్నారు. మంగపేట నుంచి రామాంజేయపురానికి బీటీ రోడ్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది.

– వేమల సతీశ్, రామాంజినేయపురం

సీఎం కేసీఆర్ సహకారంతోనే..



సీఎం కేసీఆర్ వెన్నుదన్నుగా నిలువడం వల్లే సమగ్రాభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాం. కోట్లాది రూపాయలు మంజూరు చేయడం వల్లే మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

– మెచ్చా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే, అశ్వారావుపేట

బీసీబంధు అందజేత



మణుగూరురూరల్: బీసీబంధు చెక్కు అందజేస్తున్న విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: మండలంలోని వాసవినగర్‌లో ఉన్న గిరిజన భవన్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ కులవృత్తులకు ఆర్థికసాయం పథకంలో భాగంగా సోమవారం పినపాక నియోజకవర్గంలోని 200 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.2కోట్ల విలువ చేసే చెక్కులను విప్ రేగా కాంతారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తిదారులందరికీ సీఎం కేసీఆర్ అండగా ఉంటున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు పోశం నరసింహారావు, సూదిరెడ్డి సులక్షణ, ఎంపీపీ రేగా కాళిక, గుమ్మడి గాంధీ, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: అశ్వాపురం మండల కేంద్రంలో సుమారు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులకు సోమవారం ఎమ్మెల్యే రేగా కాంతారావు శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, సర్పంచ్‌లు కోడి కృష్ణవేణి, యాదవ సంఘం మండల అధ్యక్షుడు బండారు జనార్దన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల గైర్హాజరుపై విచారణ

దుమ్ముగూడెం: మండలంలోని చిన్న కమలాపురం పాఠశాలలో ఉపాధ్యాయులు విధులకు గైర్హాజరైనట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో కాంప్లెక్స్ హెచ్ఎం ఏవీ రామారావు సోమవారం విచారణ చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు వెంకన్న వ్యక్తిగత కారణాలతో సెలవు పెడుతున్నట్టు రామారావుకు సమాచారం అందజేశారు. దీంతో అతడి స్థానంలో కొత్తూరు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబురావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, ఉదయం విధులు నిర్వహించిన బాబురావు మధ్యాహ్న భోజన పథకం బిల్లుల పని నిమిత్తం తిరిగి కొత్తూరు పాఠశాలకు వెళ్లారు.

ఆ సమయంలో పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవరూ లేక పోవడంతో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సీఆర్పీ భవానీ విచారణ చేసి ఉపాధ్యాయులు ఎవరూ విధులకు గైర్హాజరు కాలేదని మండల విద్యాశాఖ అధికారులకు నివేదిక అందజేశారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు ప్రభుత్వం అందజేసిన సైకిళ్లను సోమవారం అందజేశారు. పాఠశాలలోని 36 మంది విద్యార్థినులకు ఈ సైకిళ్లను అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌యం వెంకటేశ్వర్లు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మద్దుకూరి విద్యాసాగర్, పాఠశాల నిర్మాణ దాత రమణారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

దమ్మపేట: మండల పరిధిలో సోమవారం సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు కురిశెట్టి సత్తిబాబు అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, మృతుడి భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలతో నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మండలంలోని ముష్టిబండ, వడ్లగూడెం, వెంకటాద్రిగూడెం గ్రామాలలో నూతనంగా నిర్మించబోయే సీసీ రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. మూడు గ్రామాలలో కలిపి మొత్తం 39 సీసీ రోడ్లు మంజూరు కాగా వాటి అంచనా వ్యయం విలువ ఒక కోటి, 41లక్షల, 84వేల రూపాయలు ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రావు జోగేశ్వరరావు, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు దారా యుగంధర్, దారా మల్లిఖార్జునరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు, యార్లగడ్డ బాబు, అబ్దుల్ జిన్నా, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్ల తహసీల్దార్‌గా రామకృష్ణ

చర్ల: మండల తహసీల్దార్‌గా ఆర్.అనంత రామకృష్ణ సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పని చేసిన రంగు రమేష్‌కు కొత్తగూడెంలోని కలెక్టర్ కార్యాలయంలో సీ సెక్షన్‌కు బదిలీ కాగా కలెక్టర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఆర్.అనంత రామకృష్ణను చర్ల తహసీల్దార్‌గా బదిలీ చేయడంతో ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అనంత రామకృష్ణ మాట్లాడుతూ.. రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అన్ని రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఈఓగా శ్రీనివాసరావు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ ఈఓగా శ్రీనివాసరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్‌ను కలవగా.. నేడు ఈవోగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈయన ఖమ్మంరూరల్‌లో ఎంపీవో స్థాయిలో ఉద్యోగం చేస్తున్నారు. ఈయనే గతంలో 2016 ఏప్రిల్ నుంచి 2019 ఫిబ్రవరి వరకు భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓగా విధులు నిర్వహిస్తునే, సారపాక గ్రామ పంచాయతీకి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు.

జీఎస్పీ కార్యదర్శి నియామకం

భద్రాచలంటౌన్: గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శిగా పూనెం సాయిని, కన్వీనర్‌గా ఇర్ప ప్రకాష్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

రేషన్‌బియ్యం పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని ఆర్లగూడెం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న క్వింటా రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఆదివారం రాత్రి ఓ ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

ఆశా కార్యకర్తలు అరెస్ట్

అశ్వారావుపేటరూరల్: హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ ముట్టడికి తరలివెళ్తున్న ముగ్గురు ఆశా కార్యకర్తలను సోమవారం అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్సై పి.శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. అనంతరం సొంతపూచీకత్తుపై వారిని విడుదల చేసినట్లు తెలిపారు.

నిర్మాణ పనులు ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక పంచాయతీలో ప్రత్యేక నిధులు రూ.17.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ భూక్యా చంద్ సోమవారం ప్రారంభించారు. పంచాయతీలో ప్రత్యేక నిధులతో 4 రోడ్లు నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొల్లి సత్యనారయణ, బొల్లి శేఖర్, వార్డు మెంబర్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

చర్లరూరల్: జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొయ్యూరు వైద్యాధికారి శ్రీధర్ కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం చర్ల మండలం సాయినగర్ ప్రాంతంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 70 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ ప్రసాద్, ఎల్‌టి.గోపి, యంయల్‌హెచ్‌పిలు రమ్య, శిరీషలు పాల్గొన్నారు.

రాళ్లబాటలో వెళ్లి సేవలు



రాళ్లబాటలో కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోని ఉడుములబండ గొత్తికోయల గ్రామంలో వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం కాలినడకన రాళ్లబాటలో వెళ్లి ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, విజయ్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళి

దుమ్ముగూడెం: మండలంలోని కమలాపురం గ్రామ పంచాయతీలో బహుజన్ సమాజ్ పార్టీ సెక్టార్ అధ్యక్షుడు వర్స ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు మాన్యశ్రీ కాన్సీరామ్ 17వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు కంచర్ల సింహాద్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వర్సా పెద్ద నాగేశ్వరరావు, కాకా రామారావు, కంగాల సురేష్, బొర్రా రాజు, కాక నాగేశ్వరరావు, పర్షిక రాముడు, మడకం బాబురావు, రాజు, సత్తిబాబుతోఆపటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

కంటి పరీక్ష శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ రోడ్‌లో ఉన్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం విజయవంతమైనట్లు డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్స్ విజన్ ఐ ఆస్పత్రి వైద్యులు ఆశోక్, మహేందర్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రోశిరెడ్డి ఆధ్వర్యంలో సన్మానం

బూర్గంపాడు: ఐటీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన ఐటీసీ మాజీ ఉన్నతాధికారులు ప్రదీప్ దోబ్లే, సంజయ్‌సింగ్ దంపతులను భద్రాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు యడమకంటి రోశిరెడ్డి సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ఐటీసీ కాంట్రాక్టర్స్ పాకాలపాటి చంద్రశేఖర్, వై.సుధాకర్‌రెడ్డి, దుర్గాప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అశ్వారావుపేటరూరల్: ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధ పడుతున్న స్థానిక వీకేడీవీఎస్ రాజు కళాశాల పూర్వ విద్యార్థి, దమ్మపేట వాసి సకినాల పవన్‌కుమార్‌కు కళాశాల బాధ్యులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, బోధన సిబ్బంది కలిసి సోమవారం రూ.28,585 వితరణగా అందించారు. పూర్వ విద్యార్థులు ఎస్‌కె.గని, పి.నరేంద్ర, కె.రవీంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ వి.శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా అమలు చేయాలి

బూర్గంపాడు: దళితబంధు పథకాన్ని పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ రాజారావును వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు బయ్యా రాము,అబీదా, నాగమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

అశ్వారావుపేటరూరల్: స్థానిక సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో సోమవారం పీవైఎల్ మండల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 12,13వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పీవైఎల్ రాష్ట్ర 8వ మహాసభలు జరుగనున్నాయి. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వాసం బుచ్చిరాజు, మండల అధ్యక్షుడు బాడిస లక్ష్మణ్‌రావు, సభ్యులు కంగాల గోవింద్, కన్నారావు, తెల్లం సత్యం, బాలు, గోపి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే జీవితాల్లో వెలుగులు

చర్ల: కాంగ్రెస్‌తోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని భద్రాచలం ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య పేర్కొన్నారు. చర్ల మండలంలోని మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలలో ఉన్న పూసుగుప్ప, వెంకటచెరువు, కందిపాడు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. పలు పార్టీల నుంచి 100కు పైగా కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల విజయ భాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీను ఆదరించాలని టీపీసీసీ, ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి, పార్టీ నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించి మాట్లాడారు. నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, నండ్రు రమేష్, అల్లాడి వెంకటరామారావు, జుజ్జురు దుర్గారావు, ఉప్పల రాజశేఖర్, కొప్పుల శ్రీను, ఎస్‌కే బాబా పాల్గొన్నారు.

అశ్వాపురం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో పార్టీ ప్రచారం నిర్వహించగా.. నియోజకవర్గ నాయకుడు బట్టా విజయ గాంధీ మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గాదె కేశవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు



సరిహద్దు వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, ఏపీ సరిహద్దులో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. అశ్వారావుపేటలోని నందమూరినగర్ సమీపంలోగల చెక్‌పోస్టు వద్ద స్థానిక ఎస్సై పి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో వాహనాలను క్షుణంగా పరిశీలించి అనుమతించారు.

బీఆర్ఎస్‌లో శ్రేణుల్లో అసంతృప్తి

బూర్గంపాడు: దళితబంధు లబ్ధిదారుల పేర్లు ఆదివారం రాత్రి ప్రకటించటంతో బీఆర్ఎస్‌లో అసంతృప్తి నెలకొంది. దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో పార్టీ కోసం కష్టపడిన వారికి కాకుండా ఇతర వ్యక్తులను ఎంపిక చేయటంతో బీఆర్ఎస్‌కు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు,నాయకులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. పినపాక పట్టీనగర్ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, ఉపసర్పంచ్‌లు పార్టీకి రాజీనామా చేసే యోచన చేశారు. వారితో మండల ప్రజాప్రతినిధులు మంతనాలు చేసి వారికి సర్దిచెప్పినట్లు తెలిసింది. అదేవిధంగా కొందరు బీఆర్ఎస్ యువనాయకులు కూడా దళితబంధు ఎంపికలో తమకు అన్యాయం జరిగిందని తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు. వారు కూడా పార్టీని వీడేందుకు సిద్ధపడినట్లు సమాచారం.

పోడు భూములకు పట్టాలివ్వాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దుమ్ముగూడెం, ములకలపల్లి, దమ్మపేట మండలాలకు చెందిన ఆదివాసీలకు పోడు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ ఎదట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టిఏజీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సున్నం గంగ, కొండపల్లి శ్రీధర్, మర్మం చంద్రయ్య, బి.రమేష్, ముదిగొండ రాంబాబు, నరేష్, కాకా రమేష్, సోంది నరసింహారావు, గౌరీ నాగేశ్వరరావు, పాయం ధర్మయ్య, చంద్రకళ, కనకమ్మ, రామమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.



ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

అమల్లోకి ఎన్నికల 'కోడ్'



భద్రాచలంఅర్బన్: ట్రాలీలో ఫ్లెక్సీలను తరలిస్తున్న దృశ్యం



భద్రాచలంఅర్బన్: రాజీవ్ గాంధీ విగ్రహానికి వేసిన ముసుగు

బూర్గంపాడు: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలో అధికార యంత్రాంగం తక్షణమే ఎన్నికల నియమావళిని అమలుచేసేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సోమవారం రాజకీయపార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. పార్టీల ఫ్లెక్సీలు, జెండాలను తొలగించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున ప్రజలు, పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని తహసీల్దార్ రాజారావు తెలిపారు.

భద్రాచలంఅర్బన్: ఎలక్షన్ కోడ్ సోమవారం మధ్యాహ్నం నుంచే అమలులోకి రావడంతో అధికారులు భద్రాచలం పట్టణంలోని వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, హోర్డింగులకు ఉన్న పార్టీల ప్రచారం ఫ్లెక్సీలు, వివిధ పార్టీలకు చెందిన నాయకుల విగ్రహాలను మూసివేశారు. మంత్రి పువ్వాడ అజయ్ పర్యటన సందర్భంగా పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. క్రమంగా వాటిని తొలగిస్తున్నారు. పూర్తి స్థాయిలో కోడ్‌ను అమలు చేసేందుకు కనీసం 48 గంటలు సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాన్ మిల్టన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ నెల 10, 11 తేదీల్లో కళాశాల పని వేళలో ఒరిజనల్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల దరఖాస్తులను 12వ తేదిన పరిశీలించి అదే రోజు ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. జనరల్ అభ్యర్థులకు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

డిస్మిస్ అయిన సింగరేణి ఉద్యోగులకు అవకాశం

మణుగూరుటౌన్: జనవరి 1, 2019 నుంచి డిసెంబర్ 31, 2022 మధ్య కాలంలో విధులకు గైర్హాజరై డిస్మిస్ అయిన మాజీ ఉద్యోగులను తిరిగి ఉద్యోగ నియామకం కోసం హైపర్ కమిటీ రివ్యూ నిర్వహిస్తుందని, అందుకోసం సంబంధిత వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. సోమవారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీలోగా ఆయా గని మేనేజర్‌కు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

31 వరకు ఓటుకు దరఖాస్తు

బూర్గంపాడు: ఓటుహక్కు కోసం అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ రాజారావు తెలిపారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఓటర్ ఐడీకి ప్రత్యామ్నాయంగా 12 కార్డులను వినియోగించుకోవచ్చన్నారు. ఎలాంటి అనుమానులున్న తహసీల్దా కార్యాలయాన్ని సంప్రదించవచ్చని అన్నారు.

సక్రమంగా నిర్వహించాలి

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్‌లో సరిన్న వసతులు, ఏర్పాట్లను చేపట్టాలని నోడల్ అధికారి ఎస్.రామం అన్నారు. సోమవారం మండల తహసీల్‌లో పోలింగ్ స్టేషన్ల నిర్వహణపై సమావేశం నిర్వహించగా.. నోడల్ అధికారి ఎస్.రామం, సెక్టార్ అధికారులకు తగిన సూచనలను దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మండలంలోని ఎన్నికల సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

ఆర్డినెన్స్ జారీ చేయాలి

దుమ్ముగూడెం: జీఓ నం.3 పునరుద్ధరణకు కేంద్రం ఆర్డినెన్స్ జారీ చేయాలని, నూతన అటవీ చట్టాన్ని రద్దు చేయాలని టీఏజీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని మారాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడారు. సంఘం మండల కార్యదర్శి స్థానిక సర్పంచ్ తోడం తిరుపతిరావు, పెసా కమిటీ చైర్మన్ సున్నం వెంకటేశ్వర్లు, చిన్నమ్మి, రవి, సందీప్, నాగరత్నం, గణేష్, సావిత్రి పాల్గొన్నారు.

విస్మరించడం సరికాదు

అశ్వాపురం: ఎమ్మెల్యే రేగా కాంతారావు అశ్వాపురం మండల కేంద్రంలో గిరిజన భవన్, విశ్వబ్రాహ్మణభవన్, యాదవుల భవన్‌లకు శంకుస్థాపన చేసి దళితుల కోసం అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌ను విస్మరించడం అంబేడ్కర్‌ను అవమానించడమేనని మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

గ్రామసభ ద్వారానే ఎంపిక

దమ్మపేట: దళితబంధు పథకం లబ్ధిదారులను గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలని కోరుతూ.. సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ మధుకు వినతిపత్రం అందజేశారు. ఇదే డిమాండ్‌తో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ, నిరసన కార్యక్రమంను నిర్వహించారు. తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, పిట్టల అర్జున్, కేశవరావు, శ్రీను పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' వర్తింపజేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజన్సీలోని అర్హులైన ఆదివాసీలకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని ఏవీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లు దొర అన్నారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొమరం భీం విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. నాగేశ్వరరావు, నరసింహారావు, హరినాథ్, త్రినాథ్, బుచ్చయ్య, చంటిదొర, శ్రీను, విజయరామ్ పాల్గొన్నారు.

చేగువేరా వర్ధంతి

దుమ్ముగూడెం: మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం చేగూవేరా వర్ధంతి సభను నిర్వహించారు. సీపీఎం మండల నాయకుడు నిమ్మల మధు మాట్లాడారు. వీర్రాజు, మహేందర్, సుశీల, మంగమ్మ, శాంతమ్మ,సీతమ్మ, రంగమ్మ, వెంకమ్మ, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.